

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కూటమి విపత్తుల సమయాల్లో వారికి అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పంట నష్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతాంగానికి రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా అధికారులు రైతులకు సూచనలు చేయాలని ఆదేశించారు. పిడుగుపాటుకు గురై మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఉద్యాన పంటలు, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసానిచ్చారు.

పెద్దగణగళ్లవానిపేటలో రక్షణ గోడ నిర్మించాలి

- ఎమ్మెల్యే గొండు శంకర్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి
- 154 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం మండలం పెద్దగణగళ్లవానిపేట వద్ద కోతకు గురువుతున్న ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ప్రత్యేకంగా చర్చించారు. అలల తాకిడికి క్రమేణా తీర ప్రాంతం కోతకు గురవుతోందని, దీనిపై మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. కుందువానిపేటలో ఇళ్ల పట్టాలను అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

కంటి చూపు కోల్పోయిన విద్యార్థికి న్యాయం

రణస్థలం మండలం పైడిభీమవరంలో గతేడాది జనవరి ఒకటో తేదీన ఉపాధ్యాయుని దండనతో కంటి చూపు కోల్పోయిన విద్యార్థి చెన్నాకుమార్‌కు న్యాయం చేయాలని నవయానం బహుజన హక్కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన తల్లిదండ్రులు, బంధువులు సోమవారం జిల్లా పరిషత్ వద్ద నిరసన తెలిపారు. విద్యార్థికి వైద్యం, ఆర్థికసాయం అందించాలని గతంలో అధికారులు నివేదికలు ఇచ్చినా, ఇప్పటివరకు ఆ కుటుంబానికి ఎటువంటి సాయమందించలేదన్నారు. చెన్నాకుమార్‌ను శిక్షించిన ఉపాధ్యాయుడు ఎన్.అరుణకుమార్‌పై గానీ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చిన హెచ్‌ఎం టి.శోభారాణి పైనా ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. వీరు నిరసన చేస్తున్న విషయం తెలుసుకున్న కలెక్టర్ లోపలకు పిలిపించి వినతి స్వీకరించారు. సమస్య పరిష్కరించాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వితంతు పెన్షన్ నిలిపేశారు

తన పింఛను నిలిపేశారంటూ బూర్జ మండలం కటకమయ్య పేటకు చెందిన కోరాడ తవిటమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బూర్జ మండలం ఎంపిడిఒ లాగిన్‌లో పింఛను ఆపేయడం వల్ల తనకు డబ్బులు రావడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

పంచాయతీలో అవకతవకలపై విచారణ చేయించాలి

సరుబుజ్జిలి మండలం తెలికిపెంట పంచాయతీలో అవకతవకలపై విచారణ చేపట్టాలని గ్రామానికి చెందిన బి.మల్లేశ్వరరావు ఫిర్యాదు చేశారు. గత నెల 28న చేసిన ఫిర్యాదు మేరకు ఈనెల మూడో తేదీన డిఎల్‌పిఒ, ఇఒపిఆర్‌డి విచారణకు వచ్చిన సమయంలో సర్పంచ్ ప్రతినిధి ఎన్.గోవిందరావుతో పాటు మరో ఇద్దరు దుర్భాషలాడుతూ గొడవకు దిగారని వివరించారు. దీంతో అధికారులు విచారణ నిలిపేసి వెనుదిరిగారని, మరోసారి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

హెల్త్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలి

మల్టీ హెల్త్ అసిస్టెంట్ (పురుషులు) పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని పలువురు నిరుద్యోగ శిక్షణ అభ్యర్థులకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,800 పోస్టులు ఖాళీ ఉన్నాయని చెప్పారు. 2002 తర్వాత ఇప్పటివరకు ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 154 వినతులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 154 వినతులు వచ్చాయి. సమస్యల పరిష్కారంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి పారదర్శక విచారణ చేసి, నిర్ణీత సమయంలో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తోందని, సమస్యల పరిష్కారం పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా తదితరులు వినతులను స్వీకరించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ల్యాప్‌టాప్‌లు

డిగ్రీ ఆపైన చదువుతున్న వికలాంగులకు వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అందిస్తున్న ఐదు ల్యాప్‌టాప్‌లు, ఒక స్మార్ట్‌ఫోన్‌ను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వ సాయాన్ని ఉపయోగించుకుని చదువులో బాగా రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఈనెల 15 నుంచి ఇంటింటికీ అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాళభద్ర వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి

రైల్వేశాఖ గ్రీన్‌సిగ్నల్



ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ తాళభద్ర గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేరబోతోంది. తాళభద్ర వద్ద ఉన్న ఎల్‌సి గేటు ప్రాంతంలో సుమారు రూ.50 కోట్లతో రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఒబి) నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో దశాబ్దాల నాటి ఈ ప్రాంతవాసుల కల కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కృషితో ఫలించినట్లు అయింది. ఎప్పట్నుంచో ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బంది పెడుతున్న తాళభద్ర రైల్వే గేట్ స్థానంలో సుమారు రూ.50 కోట్ల వ్యయంతో విశాఖపట్నం-భువనేశ్వర్ రైల్వే లైన్ పైన రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ పచ్చ జెండా ఊపింది. ఈ బ్రిడ్జి నిర్మాణానికి గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 : 50 శాతం నిధులతో పూర్తి చేయాల్సి ఉండగా, ఐదేళ్లుగా నిధులు వెచ్చించకపోవడంతో ఆ పనులు ముందుకు సాగలేదు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి పరిస్థితి వివరించి నిధుల కొరత కారణంగా నిలిచిపోయిన ఈ ఆర్‌ఒబిని 100 శాతం రైల్వే శాఖ నిధులతో నిర్మించేలా ప్రాజెక్టు మంజూరు చేయించారు. ఇటీవల నిలిచిపోయిన పలాస-చిన్నబాడాం వద్ద ఆర్‌ఒబి నిర్మాణానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కృషితో శత శాతం నిధులతో రైల్వే శాఖ చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే స్ఫూర్తితో తాళభద్ర వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణ బాధ్యతను రైల్వే శాఖ తీసుకుంది. ఈ మేరకు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫుంక్వాల్ తాజాగా కేంద్ర మంత్రికి లేఖ రాశారు. తాళభద్ర లెవల్ క్రాసింగ్ (ఎంఎల్-372) వద్ద ఆర్‌ఒబి నిర్మాణ పనులు ఈ నెలలోనే టెండర్ల దశకు చేరనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన జనరల్ అరేంజ్‌మెంట్ డ్రాయింగ్ (జిఎడి)తో పాటు వివరణాత్మక అంచనా ఇప్పటికే ఆమోదం పొందినట్లు వెల్లడించారు. పలాస చుట్టూ ఉన్న రైల్వే గేట్ల వల్ల తరచూ ఏర్పడే ట్రాఫిక్ సమస్యలు, ఈ రెండు వంతెనలూ పూర్తి కాగానే తీరిపోయి, ప్రజలకు ప్రయాణం మరింత సులభతరమవుతుంది.

11న శ్రీ శూద్రగంగ కావ్యగాన సభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రాసిన శ్రీ శూద్రగంగ కావ్యగాన సభ ఈనెల 11న సాయంత్రం 5.30 గంటలకు నగరంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ ప్రతినిధులు కేతవరపు శ్రీనివాసు, అట్టాడ అప్పలనాయుడు తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కావ్య గానసభ నిర్వహణపై ప్రజాసంఘాల సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభను విజయవంతం చేసేందుకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. శ్రీ శూద్రగంగ కావ్యం నేటి సమాజ స్థితిగతుల్ని కుల మతపరమైన అణచివేతలు, వివక్షతలను ఎత్తిచూపి పరిష్కారం వైపుగా ప్రజలను కదిలించే శక్తివంతమైన కావ్యమని వివరించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని తన గేయాలతో ప్రజలను కదిలించిన గొప్ప కవి సుద్దాల హనుమంతు కుమారుడు సుద్దాల అశోక్‌తేజ అని వివరించారు. ఆయనకు నిజమైన వారసునిగా సాహిత్య రంగానికి సేవలందిస్తున్నారన్నారు. శ్రీకాకుళం ప్రజల సాహిత్య సాంస్కృతిక అభిలాషని చాటి చెప్పేలా సభను దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పలు సంఘాల ప్రతినిధులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, బడియా కామరాజు, దొంతం పార్వతీశం, కె.నాగమణి, ఎం.గోవర్ధనరావు, కె.గణపతి, మిస్కా కృష్ణయ్య, డి.గణేష్, ఎం.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసు

నేర పరిశోధనలో ఫోరెన్సిక్ కీలకం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి


మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

ముఖ్యమైన కేసుల దర్యాప్తునకు నేర పరిశోధనలో సేకరించిన ఫోరెన్సిక్ ఆధారాలే కీలకమని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. ఆ దిశగా నేర స్థలం పరిశోధనలో అనుసరించాల్సిన విధి విధానాలు తూచా తప్పకుండా పాటించాలని దర్యాప్తు అధికారులకు సూచించారు. పోలీసు అధికారులు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఫోరెన్సిక్ నిపుణులతో మండలంలోని గాయత్రి విద్యాసంస్థలో సోమవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, నిర్వహణ, చైన్ ఆఫ్ కస్టడీ మార్గదర్శకాలు, నేర పరిశోధనలో అనుసరించాల్సిన విధి విధానాలు, ఆధునిక శాస్త్రీయ ప్రమాణాలు తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నేర స్థలం పరిశోధనలో దర్యాప్తు అధికారులు ఆధారాలు సేకరించాల్సిన సమయంలో నేరం జరిగిన చోటుకు పోలీసులు ఏ విధంగా రక్షణ కల్పించాలి, ఈ క్రమంలో నేర స్థలంలో డిఎన్‌ఎ, రక్త నమూనాలు, మానవ అవయవాలు, వెంట్రుకలు, నార్కోటిక్స్, మత్తు పదార్థాలు తదితర సాక్ష్యాధారాలను సేకరించడాన్ని వివరించారు. ప్యాకింగ్, నిల్వ, భద్రపరచడం, లెటర్ ప్రిపేర్, ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి నివేదికను వారంలోనే పొందే విధానం, కోర్టుకు తీసుకెళ్లే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు అనే అంశాలపై వర్క్ షాప్‌లో ప్రముఖ ఫోరెన్సిక్ నిపుణులతో శిక్షణా తరగతులు నిర్వహించారు. నేరస్తులకు కోర్టుల్లో శిక్షలు పడితేనే నేరాలు తగ్గుతాయన్నారు. ఆ దిశగా అత్యంత అధునాతన శాస్త్రీయ ప్రమాణాలు, పద్ధతులు అందిపుచ్చుకుని కేసులు దర్యాప్తు చేపట్టాలని సూచించారు. కేసుల విచారణ ప్రారంభమైన సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో కేసుల దర్యాప్తు ఉండాలన్నారు. దర్యాప్తు అధికారులకు ఫోరెన్సిక్ భౌతిక ఆధారాల సేకరణలో పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. నేర స్థలం పరిశోధనలో ప్రతి ఆధారం కీలకమని స్పష్టం చేశారు. అనంతరం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులకు ఎస్‌పి జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద్, వి.వెంకట అప్పారావు, మంగళగిరి, విశాఖపట్నం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులు వి.ప్రశాంతి, జి.గోపాలకృష్ణ, ఎల్.ఊహ, ఎస్.నళిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిఐలు, ఎస్ఐలు, ఎఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నారాయణ సాగరం ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి - లావేరు

బుడుమూరు నారాయణ సాగరం ఆక్రమణలు తొలగించి మినీ రిజర్వాయర్‌గా చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఈనెల ఏడో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని బుడుమూరులో కరపత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులని పూర్తి చేయకపోవడం వల్ల సాగునీరందక నిరంతరం కరువుకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టులు పూర్తి చేసి బుడుమూరు నారాయణ సాగరానికి నీళ్లు ఇస్తే దిగువనున్న సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఇప్పటికే ఈ రెండు కాలువల ద్వారా సాగునీరు రావాల్సి ఉన్నా, కాలువల నిర్వహణ సరిగ్గా లేక నీరు రావడం లేదన్నారు. ఈ విషయమై అనేక దఫాలుగా అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పని జరగలేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి నారాయణ సాగరాన్ని మినీ రిజర్వాయరుగా చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీను, తవిటినాయుడు, గోవిందరావు, లక్ష్మణ, గోపి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను పంపిణీ చేస్తున్న రైతుసంఘం నాయకులు

గురుకులాల్లో సౌకర్యాల మెరుగుకు ఉద్యమం


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

అంబేద్కర్ గురుకులాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని దళిత సంఘాల జెఎసి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిర్‌లో దళిత సంఘాల జెఎసి సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు కళ్లేపల్లి రాంగోపాల్ మాట్లాడుతూ గురుకులాల్లో గత ప్రభుత్వ ఐదేళ్లలో ఒక్క ఉద్యోగమూ భర్తీ చేయలేదన్నారు. విద్యార్థులకు గడచిన దశాబ్దాల కాలం నుంచి ఇస్తున్న కాస్మోటిక్స్ ఛార్జీలు ఇవ్వకుండా వాటిని రద్దు చేసిందన్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. భవనాలు లేవని, మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. తాగునీరు, వాడక నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. డార్మెటరీ సౌకర్యం అస్తవ్యస్తంగా ఉందన్నారు.


ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని గురుకులాలను అభివృద్ధి చేయాలన్నారు. గురుకులాల్లో ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. సమావేశంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు గొంటి గిరిధర్, ఎస్‌ఎన్‌పిఎస్ నాయకులు గణేష్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, బెలమర ప్రభాకరరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, సమతా సైనిక్ దళ్ నాయకులు దేబారికా రామప్పడు, రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా నాయకులు పేడాడ కృష్ణారావు, కోత ధర్మారావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బాదపు, వాణి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి

డిఎస్‌సి-2003 ఉద్యోగ, ఉపాధ్యాయుల పోస్టుకార్డు ఉద్యమం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉద్యోగ నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వ తప్పిదం వల్ల ఆలస్యమైందని, ఫలితంగా పాత పెన్షన్‌ను కాదని కొత్త పెన్షన్ విధానాన్ని వర్తింపజేయడం అన్యాయమని డిఎస్‌సి-2003 జిల్లా ఫోరం కన్వీనర్ కె.శ్రీహరి, సిపిఎస్ నాయకులు గురుగుబెల్లి భాస్కరరావు అన్నారు. డిఎస్‌సి-2003 నియామకపు ఉద్యోగుల ఆధ్వర్యాన పోస్టుకార్డు ఉద్యమాన్ని సోమవారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధరేశ్వరికి పోస్టుకార్డులను పంపించారు. రాష్ట్రంలో సిపిఎస్ అమలు తేదీ 2004 సెప్టెంబర్ ఒకటి కంటే ముందు నోటిఫికేషన్లు విడుదల చేశారని, నియామకాలు జాప్యం ఉద్యోగుల తప్పిదం కానే కాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు కేంద్ర మెమో 57 ప్రకారం పాత పెన్షన్‌కు అర్హులని, తక్షణమే వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింజేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీను, బుచ్చిబాబు, అనిల్ కుమార్, మాధవి, శ్రీదేవి, లోకనాథం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టుకార్డులను పంపిస్తున్న ఉద్యోగులు

మనసారా మానేయాలని...!

నవోదయం 2.0 పేరిట ప్రత్యేక కార్యక్రమాలు



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు (ఫైల్)

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నాటుసారాపై ప్రజల్లో అవగాహన కల్పించి దానిని నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0ను ప్రారంభించింది. ఫిబ్రవరి 19 నుంచి ఆబ్కారీ శాఖాధికారులు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రత్యేక కార్యక్రమాలు, ప్రచారం నిర్వహించి నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు.

గిరిజనులు ఆర్థిక ఇబ్బందుల నుంచి అధిగమించడానికి సారా తయారీ, అమ్మకాలతో ఆదాయం చేకూరుతుందని భావించి తయారీకి మక్కువ చూపిస్తుంటారని ప్రచారం ఉంది. ఎక్సైజ్‌శాఖ పరంగా నాటుసారా బట్టీలపై నవోదయ 2.0 కార్యక్రమం ద్వారా దాడులు విస్తృతంగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా గిరిజనులకు ఉపాధి ఆసరా కల్పిస్తామని భరోసా ఇస్తున్నారు. గిరిజన మారుమూల గ్రామాల్లో సారాతయారీ అమ్మకాలు ఎక్కువగా సాగుతున్నాయి. మెళియాపుట్టి మండలంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు హడ్డివాడ, ఆంపురం, పడ్డ, గొడ్డ, మర, రాయిగుడ్డి, ముకుందాపురం, చింతల పోలూరు, బంజీరు, గొల్లబంజీరు, కొత్తూరు, చింతపల్లి, మర, ఎకువ బగడ, గుమడ, ఎకువ గుమ్మడ, బానాపురం, సవర బాణాపురం తదితర గ్రామాల్లో బట్టీల స్థావరాలపై దాడులు నిర్వహించి భారీగా బెల్లం ఊటలను స్వాధీనం చేస్తున్నారు. పాతపట్నం మండలం చాపరాయిగూడ, సోంపేట మండలం కోరంజిభద్ర, పట్టులోగాం గ్రామాల్లో దాడులు నిర్వహించి పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. అనంతరం ఆయా గ్రామస్తులకు చైతన్యంపై సమావేశాలు నిర్వహించి గిరిజనులకు అవగాహన కల్పించారు.

విస్తృత అవగాహనతో...

కార్యక్రమాల నిర్వహణకు ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా ఓ అధికారిని నియమిస్తున్నారు. అతడి ద్వారా అటవీ, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖ, స్థానిక ప్రజలతో కలిసి గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ఆధ్వర్యాన గ్రామసభలు నిర్వహించి సారా వినియోగం, ప్రమాదాలు, తయారీకి సంబంధించిన శిక్షలు, చట్టాల గురించి వివరిస్తున్నారు. ఇప్పటికే సోంపేట, మందస, మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో బైండోవర్ కేసులు నమోదు చేశారు. జిల్లాలో మెళియాపుట్టి, పాతపట్నం, మందస, సోంపేట తదితర మండలాల్లో నాటుసారా ప్రభావిత గ్రామాలున్నా యి. వీటిని కేటగిరీలుగా విభజించారు. ఎక్కడైనా నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు చేపడితే టోల్ ఫ్రీ నంబరు 14405కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెబుతున్నారు. సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ప్రజలు తమ వంతు సహకారం అందించాలని ఎక్సైజ్ పోలీసులు కోరుతున్నారు.

212 ఐడి కేసులు నమోదు

నవోదయం2.0 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గడచిన నాలుగు నెలల్లో 212 ఐడి కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు 162 మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 2,231 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. పెద్దఎత్తున బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తున్న 874 మందిపై కేసులు నమోదు చేసి 1454.67 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. భవిష్యత్‌లో శతశాతం లక్ష్య సాధనకు ఎక్సైజ్ అధికారులు కృషి చేస్తున్నారు.

ఉపాధి కల్పించాలి



గిరిజనులకు ఉపాధి లేక కొంతమంది నాటుసారాపై తయారీపై మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వపరంగా నాటుసారా తయారీదారులకు జీవనోపాధి మార్గం కల్పించినట్లయితే తగ్గుముఖం పడుతుంది. ప్రభుత్వం, ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలి.

– డి జమ్మయ్య, గిరిజన సంఘ నాయకులు

అవగాహన కల్పిస్తున్నాం



మెళియాపుట్టి మండలంలో 31, నందిగాం మండలంలోని నాలుగు గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహనా సదస్సులు నిర్వహించాం. ఎవరైనా సారా తయారీ మానేసి ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోవాలి. అందుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా తమకు దరఖాస్తును అందించినట్లయితే గొర్రెలు, మేకలు, తదితర యూనిట్లను అందిస్తాం.

– షేక్ మీరా సాహెబ్, సిఐ ఎక్సైజ్, టెక్కలి

ఇచ్ఛాపురానికి వంశధార జలాలు

ప్రభుత్వ విప్ అశోక్


వంశధార జలాలను విడిచిపెడుతున్న విప్ అశోక్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో నెల రోజులుగా ప్రజలు ఎదుర్కుంటున్న తాగునీటి సమస్యకి వంశధార జలాలతో తాత్కాలిక పరిష్కారం చేపట్టామని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలో సంతపేట వద్ద జలజీవన్ మిషన్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా సోమవా రం ఉద్దానం ప్రాజెక్టు ద్వారా వస్తున్న వంశధార జలాలను ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు కొబ్బరి కాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా తాగునీటి సమస్యతో ప్రజలు పడుతున్న అవస్థలు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు పర్యటన సందర్భంగా ఇచ్ఛాపురం తాగునీటి సమస్య పరిష్కారంపై సమీక్షించామన్నారు. జలజీవన మిషన్ ద్వారా మున్సిపాలిటీకి తాగునీరు సరఫరాకు ఆదేశించడంతో వేగవంతంగా పనులు పూర్తయ్యా యన్నారు. ప్రస్తుతానికి తాత్కాలిక పరిష్కారం మాత్రమే అన్నారు. మున్సిపాలిటీ ఆవిర్భావం నుంచి 1,2,3 వార్డులు రక్తకన్న, బెల్లుపడ వీధుల్లో కుళాయి నీరు లేదన్నారు. ఎఐబి పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి ద్వారా నీరు అందించేందుకు సమగ్ర నీటి పథకం నుంచి రూ.62 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. త్వరలో ఎఐబి తాగునీటి పథకానికి సంబంధించి నిధులు విడుదలకు కృషి చేస్తామన్నారు. బహుదాలో నదీ అక్రమ ఇసుక తవ్వకాలు నిరోధించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, ఎస్ఇ సుగుణకరరావు, కమిషనర్ రమేష్, టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, సాలిన ఢిల్లీ, కాళ్ల దిలీప్‌కుమార్, పత్రీ తవిటయ్య, నందిక జాని, లీలారాణి, నందిగాం కోటి, విశ్వనాథరెడ్డి, ఎస్.శేఖర్, రెయ్య జానకిరావు, కొండ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాల లొల్లి!

కవిటి: కవిటి మండలం శిలగాం ఎస్‌బిఐ బ్రాంచ్‌లో డ్వాక్రా సంఘాలకు కేటాయించే రుణాల్లో బ్యాంకు సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని, కోట్ల రూపాయలు పక్కదారి పట్టించి సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలు సోమవారం గుప్పుమన్నాయి. చివరికి బ్యాంకు అధికారులే ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చిందని ప్రచారం సాగుతుంది. దీనిపై కవిటి ఎస్‌ఐ రవివర్మ, ఎపిఎం గోవింద్‌ను సంప్రదించగా, వారు విస్మయం వ్యక్తం చేశారు. డ్వాక్రా సంఘాల రుణాల్లో అక్రమాలపై నాలుగేళ్ల కిందట ఫిర్యాదులు రావడం, సదరు వ్యక్తుల వద్ద సొమ్ము రికవరీ కూడా చేసినట్టు తెలిపారు. ఇటీవల కాలంలో తనకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు. ఇదే విషయంపై శిలగాం ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ కనకరాజును సంప్రదించగా, గత 18 నెలలుగా తాను శిలగాం బ్యాంచ్‌లో పనిచేస్తున్నానని, ఎప్పుడూ ఈ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు. అయితే గతంలో జరిగిన ఈ సంఘటన విషయంలో గుట్టుగా వ్యవహరించడం ఇప్పుడు వ్యవస్థకు చెడు చేస్తోందన్నారు. ఈ ఆరోపణలపై బ్యాంకు అధికారులు పక్కాగా వివరణ ఇవ్వాలని స్థానికులు, బ్యాంకు ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, సోంపేట
O.S 26/2023

కర్రి శ్రీనివాస్ రెడ్డి .....వాది
మరియు:
గుర్రు నారాయణస్వామి, And another.
.....ప్రతివాదులు

దావా సమన్

To,
గుర్రు నారాయణస్వామి, S/o దండాసి, వయస్సు 52 సం॥, వ్యవసాయం, బూరగాం గ్రామం & పోస్టు, కంచిలి మండలం, శ్రీకాకుళం జిల్లా. (ఆం.ప్ర.)

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు పలుమార్లు కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా నోటీసులు పంపించననూ ఉద్దేశపూర్వకంగా పుచ్చుకోకుండా తప్పించుకుంటూయున్నారు. గాన మీ హాజరు కొరకు పై కోర్టువారు పై దావాను **తే 16-05-2025 దీన** వాయిదా వేసి ఈ పేపరు ప్రకటన మూలంగా నోటిసులు జారీ చేసియున్నారు. కావున పై తెల్పిన **తే 16-05-2025 దీన ఉదయం గం॥ 10-30 ని॥లకు** మీరు పై కోర్టు నందు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని పక్షమున దావా విచారించి మీ పరోక్షమున తీర్మానించబడును అని యిందు మూలంగా తెలియజేయడమైనది.

(మహారాజశ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

శిలగాన భాస్కరరావు
న్యాయవాది,
సోంపేట, శ్రీకాకుళం జిల్లా.

అభివృద్ధి పనులు వేగవంతం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టెక్కలి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రోడ్లు, భవనాలశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిసి రోడ్లు అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తిగా చేయాలని సూచించారు. మట్టి రహదారులన్నీ సిసి రోడ్లుగా నిర్మించాలన్నారు. ఇంకా ప్రారంభం కాని పనులు ఉంటే వెంటనే టెండర్లు పిలవాలని అధికారులకు సూచించారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో అధికారులు రవికాంత్, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే నిమ్మాడ క్యాంప్ కార్యాలయం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేయాలని అధికారులకు ఆదేశించారు.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రూ.65 లక్షలతో శ్మశానవాటికల అభివృద్ధి

పలాస: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఆరు శ్మశాన వాటికల్లో రూ 65 లక్షలతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో శ్మశానవాటికలో చేపడుతున్న అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.15.00 లక్షల అంచనా విలువతో ఉదయ పురం, రూ.15.00 లక్షల అంచనా విలువతో సూది కొండ, రూ.15 లక్షలతో పురుషోత్తపురం, రూ.15 లక్షలతో కాశీబుగ్గ 12వ వార్డులోని శ్మశాన వాటికల కాంపౌండ్ వాల్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. రూ.7.50 లక్షల అంచనా వ్యయంతో కాశీబుగ్గ కెట్టి రోడ్డులోని మైనారిటీ బరియల్ మైదానం కాంపౌండ్ వాల్, రూ.2 లక్షలతో నీలాపురం బరియల్ మైదానంలో హ్యాండ్ బోరు నిర్మాణానికి టెండర్లు పూర్తయాయని తెలిపారు.

గ్రీవెన్స్‌కు 11 దరఖాస్తులు

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆస్తి పన్ను పేరు మార్పు, జనన, మరణ ధ్రువపత్రాలు, వితంతు పెన్షన్లు, తాగునీటి కోసం 11 వినతులు అందాయని కమిషనర్ తెలిపారు. ఎవరికైనా తాగునీటి సమస్య వస్తే తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.


పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు


రాజారావు మాస్టర్‌ను సత్కరిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

రాజారావు మాస్టారుకి సత్కారం

ప్రజాశక్తి- పొందూరు

మండలం వావిలపల్లిపేటకు చెందిన ఉపాధ్యాయుడు వావిలపల్లి రాజారావును జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య సోమవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మా నించారు. రాజారావు మాస్టారు విశ్వావసు నామ సంవత్సర రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారం పొందిన నేపథ్యంలో ఆయనను డిఇఒ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా నోబెల్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షులు సూర పాపారావు, డిటిఎఫ్ సంఘ నాయకులు టి.మురళి, పూజారి రాధాకృష్ణ, ఎ.మాధవ్, ఎ.వేణు, బిటిఎ అమరావతి జిల్లా అధ్యక్షులు ఎన్.లక్ష్మణరావు, విశ్రాంత ఎంఇఒ పి.వి.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ఆమదాలవలస : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం 8వవార్డు టిడిపి ఇన్‌ఛార్జి ధవళ అప్పలనాయుడు ఆధ్వర్యంలో 8వవార్డుకు చెందిన బి.మహేష్, సాయి, చిన్న, కిరణ్‌లకు టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

10, 11న తెలుగు సాహితీ సంబరాలు

ప్రజాశక్తి- రణస్థలం

ఐఎస్ఒ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ శ్రీశ్రీ కళా వేదిక సిఇఒ కళారత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, ఈశ్వరీ భూషణం, పార్థసారథి ఆధ్వర్యంలో కవులకు, కళాకారులకు తెలుగు భాష, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ ఏలూరులో మహాలక్ష్మి గోపాల కళ్యాణ మండపంలో జరిగే తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం అందుకున్న కవులు, రచయితలు, కళాకారులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల ప్రోగ్రాం కన్వీనర్, ఉత్తరాంధ్ర శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన) తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని చిగురుకొత్తపల్లి మాజీ సర్పంచ్ కోనేటి శ్రీనువాసరావును సోమవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పరామర్శించారు. శ్రీనువాసరావుకు ఇటీవల నేత్ర శస్త్ర చికిత్స జరిగి ఇంటివద్ద కోలుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరామర్శించారు. పరామర్శించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, కునపల్లి దామోదరరావు, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, పెద్దకొత్తపల్లి సర్పంచ్ ఆరేళ్ల కృష్ణ, దారపురెడ్డి కూర్మారావు, కూటమి నాయకులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని దేరసాంలో సోమవారం ఉపాధిహామీ పనులను ఎంపిటిసి దన్నాన వంశీకృష్ణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదికి సంబంధించి ఉపాధిహామీ పనులు నల్లచెరువు, నేరేడు చెరువుల్లో పనులు చేయాలన్నారు. ఎండత్రీవత ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో చేయాలని కోరారు. అలాగే సంబంధిత అధికారులు సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ చేపట్టాలి

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీష రైల్వే అధికారులను కోరారు. పలాస రైల్వే స్టేషన్లు భువనేశ్వర్ అదనపు జనరల్ మేనేజర్ మోహిష్ కుమార్ బెహరా సోమవారం పరిశీలించారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్‌లో క్లీన్, హైజెనిక్ వాష్ రూములు, మెరుగైన తాగునీరు సరఫరా, వికలాంగులకు తగు సౌకర్యాలు కల్పించాలని కోరారు. జిఎం మాట్లాడుతూ రైల్వేస్టేషన్ పరిధిలో పరిశుభ్రమైన మరుగుదొడ్ల నిర్మాణాలు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎన్‌ఎస్ జి 3 కేటగిరిలో రైల్వేస్టేషన్ అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. అమృత్ స్టేషన్ పథకంలో రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. స్టేషన్ పరిధిలో ఆరు అత్యాధునిక వాటర్ కూలర్లు సమకూర్చుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, పి.విఠలరావు, కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, సవర రాంబాబు, చంద్రశేఖర్ త్యాడి, పుక్క లోకనాథం పాల్గొన్నారు.


ధర్నా శిబిరం వద్ద మాట్లాడుతున్న కృష్ణారావు

ఎంఎల్‌హెచ్‌పిల ఆందోళనకు సంఘీభావం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా కలెక్టరేట్ సమీపాన గత వారం రోజులుగా కొనసాగుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. సోమవారం ధర్నా శిబిరం వద్ద డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు హాజరై వారినుద్దేశించి మాట్లాడారు. బిఎస్‌సి నర్సింగ్‌కోర్సు చదువుకుని కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం నిధులతో పాటు నిబంధనలను అనుసరించి నోటిఫికేషన్ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నియామకాలు చేపట్టిందని, అయితే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా ఎంఎల్‌హెచ్‌పిలను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ సమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఉద్యోగాల్లో నియమించినప్పటికీ కనీస ఉద్యోగ భద్రత లేదన్నారు. ఉద్యోగులపై గత ప్రభుత్వ విధానాలనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవలంభిస్తోందన్నారు. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, బదిలీలు, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసే అన్ని సదుపాయాలను ఎంఎల్‌హెచ్‌పిలకు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మామిడి సత్యనారాయణ, డిసిసి ప్రధాన కార్యదర్శి ఇజ్జురోతు రమణ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పలాస : ఆర్‌టిసి ఉద్యోగుల సమస్య పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్‌టిసి కార్యాలయ సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్లుగా నిలిచిపోయిన ఉద్యోగోన్నతులను కల్పించాలని కోరారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జిఒ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలన్నారు. తీవ్ర అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఒడిలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంయుఎ నాయకులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని పలు గ్రామాలకు రోడ్లు, కాలువలు నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం, ఎస్‌డిపి నిధులు రూ.6 కోట్లు నిధులు మంజూరుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చేశారని టిడిపి నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గులుమూరు, నవిగాం, ఆకులతంపర, శోభనాపురం, గొట్టభద్ర, వంశధార, కడుం గ్రామాల రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశలు వారీగా అమలు చేస్తోందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు అగతముడి మాధవరావు, అరుణ్‌కుమార్, మాతల గాంధీ, వి.వెంకటరావు, పాతకొండ మోహనరావు, నెల్లి అచ్యుతరావు, పడాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

నాయకుల జీవిత చరిత్ర తెలుసుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రాథమిక స్థాయి నుంచే జాతీయ నాయకుల కోసం ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని రిసోర్స్‌పర్సన్ లంకలపల్లి సూర్యనారాయణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జాతీయ నాయకుల జీవిత చరిత్ర క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. అలాగే వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమములో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎస్.ఉదయ్ కిరణ్ అధ్యక్షతన చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముందుగా జూనియర్స్ విభాగం విద్యార్థులకు పర్యావరణంపై సీనియర్స్ విభాగం విద్యార్థులకు సందేహాత్మక చిత్రాలు నిర్వహణ చేపట్టారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మెళియాపుట్టి మండల సమావేశం

మెళియాపుట్టి : ఈ నెల 6న మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలన్నారు.

వడదెబ్బపై అప్రమత్తం

పాతపట్నం: వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని తెంబూరు హోమియో వైద్యాధికారి ఎస్.ఉమాగౌరి అన్నారు. మండలంలోని పెద్దసిధ్ధిలోపల్లిలో ఉపాధి హామీ పని వద్ద కూలీలకు ఎండ తీవ్రతకు వడదెబ్బలకు గాను తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కల్పించారు. ఉపాధి పనికి వచ్చే వారు ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వాటికి అవలంబించే ఆరోగ్య సూత్రాలు వివరించారు. అనంతరం సుమారు 70 మందికి హోమియో మందును పంపిణీ చేశారు.

మహిళ శస్త్రచికిత్సకు రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రక్తదానంపై అపోహలు వీడి యువత భాగస్వాములు కావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు అన్నారు. సోమవారం వివాహిత శస్త్ర చికిత్స కోసం ఆస్పత్రిలో చేరడంతో ఆమెకు అరుదైన ఎబి నెగిటివ్ రక్తం అవసరమైంది. దీంతో స్థానికంగా ఉన్న కొల్ల లక్ష్మణరావు అదే రక్తం కలిగి ఉండడంతో ఆయనను సంప్రదించి అత్యవసర రక్తాన్ని అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావును ఆయన అభినందించారు. ఈ శిబిరంలో నంది ఉమాశంకర్, శివాజీ రక్తనిధి కేంద్రం మేనేజర్ ఆయేషా బేగం, బి.జగదీష్ పాల్గొన్నారు.

ఉచితంగా వ్యాక్సిన్లు అందించాలి

నందిగాం: సీజనల్ వ్యాధులు బారిన పడకుండా గొర్రెలకు, మేకలకు వ్యాక్సిన్లు ఉచితంగా అందించాలని ఎపి గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.సాంబమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల కాలువల్లో, చెరువుల్లో నీరు లేక మేత కొరత ఏర్పడుతుందన్నారు. దీనివల్ల జిల్లాలోని గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో జిల్లా మొత్తం ఐదు వేల జీవాలని గొర్రెలు, మేకలు మృతి చెందాయన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి టీ వార్మింగ్ ఉచితంగా పంపిణీ చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యాక్సిన్లు వేయాలని కోరారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

నందిగాం : మండలంలోని వెంటవూరు శివాలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పిఇటి కేశవ డ్యాన్స్ ఎకాడమీ టెక్కలి చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు. ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం ధర్మకర్తలు అట్టాడ ఠాగూర్ నాయుడు, తెంబూరు మాధవరావులు దేశభక్తి, దైవభక్తి పరమైన పాటలకు నృత్యప్రదర్శన చేశారు. ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అట్టాడ సింహాద్రప్పలనాయుడు, బొడ్డ నారాయణరావు, బడా నారాయణరావు, తెంబూరు కంచయ్య, తెంబూరు రామయ్య, బి.శంకర్, టి.కోదండరావు పాల్గొన్నారు.


శిథిలావస్థలో వాటర్ ట్యాంకు


శిథిలావస్థలో ఉన్న ట్యాంక్

ఇచ్ఛాపురం: మండలంలోని బిర్లంగిలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకర్ ట్యాంకు శిథిలాస్థవస్థకు చేరుకుంది. సుమారు 30 ఏళ్ల క్రితం గ్రామం మధ్యలో 60 వేల లీటర్ల కెపాసిటీతో నిర్మించారు. ప్రస్తుతం అది కూలేందుకు సిద్ధంగా ఉంది. గ్రామ మధ్యలో ఉండటంతో ఏ క్షణాన ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందు తున్నారు. దీన్ని తొలగించి వేరే ప్రాంతంలో కొత్తగా నిర్మించాలని 2023 జూన్ నెలలో సర్పంచ్ డి.బృందావతి తీర్మానం చేశారు. అనంతరం కలెక్టర్ నిర్వహించిన మీ కోసంలో వినతిపత్రాన్ని అందజేశారు. దీని పునర్ని ర్మాణానికి రూ.64 లక్షలు నిదులు మంజూరయ్యాయి. అయినా పనులు ప్రారంభం కాలేదు. జిల్లా అధికార యంత్రాంగం చొరవ తీసుకోని, శిథిలావస్థలో ఉన్న ట్యాంకర్‌ను తొలగించి వేరేచోట నిర్మించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని పాటించాలి

శ్రీకాకుళం: ప్రాథమిక తరగతులున్న అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ఒకే విధంగా ఉండేలా నిర్ణయాలు తీసుకోవాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎపి ఎస్‌టిఎ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతుల బోధనకు, మిగిలిన ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో బోధనకు ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తిలో వ్యత్యాసం ఉందన్నారు. ఈతరహాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను కేటాయించడం సరికాదన్నారు. ఈ విధానం అమలు వల్ల ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు నిర్వీర్యమయ్యే పరిస్థితి ఉందన్నారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, 21 నుంచి 60 వరకు ఇద్దరు టీచర్లు, 61 నుంచి 90 వరకు ముగ్గురు టీచర్లు కేటాయించారని, ఫౌండేషన్ స్కూళ్లలో 30 మంది విద్యార్థులకు ఒకే టీచర్‌ను కేటాయించారని గుర్తు చేశారు. ఉన్నత పాఠశాలలో ప్రైమరీ క్లాసెస్ ఏర్పాటు చేసిన క్రమంలో మోడల్ ప్రైమరీ స్కూల్లో ఐదుగురు టీచర్లను కేటాయించారన్నారు. 1 నుంచి 10 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు, 11 నుంచి 30 వరకు ముగ్గురు టీచర్లు, 31 నుంచి 40 వరకు నలుగురు,45 పైబడితే మోడల్ ప్రైమరీ స్కూల్‌గా పరిగణించి ఐదుగురు ఉపాధ్యాయులను ఇచ్చే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందని గుర్తు చేశారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలన్నారు. ఉన్నత పాఠశాలలో నలభై ఐదు మందికి ఒక సెక్షన్‌గా పరిగణించాలని, స్కూల్ అసిస్టెంట్‌లను కేవలం ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలకు పిఎస్, హెచ్‌ఎం పోస్టులను ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు.


సన్మాన గ్రహీతలతో విప్ అశోక్

ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి- కవిటి

తమతమ రంగాల్లో విశిష్ట సేవలందించి ఇటీవల అత్యున్నత స్థాయి వ్యక్తుల నుంచి అవార్డులు అందుకున్న పలువురిని బొరువంక గ్రామస్తులు సోమవారం ఆత్మీయ సత్కారం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఉత్తమ జర్నలిస్టుగా సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ చేతులు మీదుగా అవార్డు అందుకున్న పూడి సత్యనారాయణ, నాటక రంగంలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి కందుకూరు అవార్డు అందుకున్న బెండాళం శోభన్, బల్లెడ చలపతి, ఉగాది పురస్కారం అందుకున్న చక్ర పెరుమాళ్ స్వామి ఆలయం అర్చకుడు బాలక సత్యనారాయణ, బదిలీ ఉద్యోగి సింహాచలంను ప్రభుత్వ విప్ బెండాళం అశోక్ చేతులు మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెండాళం శ్రీరామ్ ప్రసాద్, బెండాళం విజయ్ కృష్ణ, పొందల కృష్ణారావు, బల్లెడ జయప్రకాష్, శమల్ల సర్వేశ్వరరావు, రెయ్యి సోమేశ్వరరావు, బల్లెడ బాబాబూరావు, బల్లెడ శ్రీపతి పాల్గొన్నారు.

క్యాంపస్ ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలోని అరసవల్లి జంక్షన్ వద్ద గల కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా 500 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివిధ కంపెల నుంచి సోమవారం నియామకపు పత్రాలను డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్‌లు వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ పట్టా చేతికి అందక ముందే ఉద్యోగాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఉద్యోగాల్లో చేరి ఉజ్వల భవిష్యత్ సాధించాలన్నారు. డిగ్రీ మొదటి ఏడాది నుంచే ఉద్యోగాలు సాధించడానికి ఉపయోగపడే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ఇవ్వడం కాకినాడ ఆదిత్య సంస్థలకే సాధ్యమవుతోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.


ఎంపికైన కాకినాడ ఆదిత్య విద్యార్థులు


ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం రమణారావు

ఉపాధ్యాయుల వినూత్న ప్రచారం

పలాస: బడుగు, బలహీన వర్గాల వారు, శ్రామికులు అప్పులు చేసి గొప్పలకు కార్పొరేట్ విద్య అందించాల్సిన అవసరం లేదని, మన ఊరి పాఠశాల మేలని మండలంలోని బ్రాహ్మణతర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు అన్నారు. గ్రామ సమీపంలో జెంగం చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు సోమవారం వెళ్లి వినూత్నంగా మైకు ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. అందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విశాలమైన క్రీడా మైదానం, ఆంగ్ల మాధ్యమం విద్య, ఉచితంగా యూనిఫారాలు, బెల్ట్, షూ, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, నాణ్యమైన బోధన అందించే సుశిక్షితులైన ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.ఈశ్వరరావు, ఎ.మధుబాబు, కొయ్యల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

నవధాన్యాల సాగుతో నేలలో వివిధ రకాల పోషకాల అభివృద్ధితో పాటు అధిక ఆదాయం లభిస్తుందని మాస్టర్ ట్రైనర్ లక్ష్మునాయుడు అన్నారు. సోమవారం మండలంలోని తమ్మినాయుడుపేట యూనిట్‌లో పిఎండిఎస్ నవధాన్యాల విత్తనాల తయారీ చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు మాట్లాడుతూ ఈ నవధాన్యాలు సాగు వలన నేలలో వివిధ రకాల పోషకాలు అభివృద్ధి చెంది వేరు వ్యవస్థ ద్వారా వానపాములు వృద్ధి, అధిక ఆదాయంతో పాటు నేలలో నీటి సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ శ్రీనివాస్, ఇన్‌ఛార్జి చంద్రకళ, బాబురావు, పద్మ, రాజేశ్వరి, కాంచన, ప్రసాద్, సిడిఎఫ్ పూర్ణ, ఎంపిటిసి రామారావు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : నవధాన్యాల విత్తన తయారీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బూర్జ: మండలం పాలవలసలో మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వరి పంటలో నవధాన్యాల సాగు, పిఎండిఎస్ 11 రకాల పంటలతో 5 కేజీల పరిమాణం కలిగిన వెయ్యి కిట్లు తయారు చేశారు. నవధాన్యాలు వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్నమ్మడు, సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి జనార్ధనరావు, శ్రావణి, తవిటినాయుడు, గణపతి, శంకర్, లావణ్య, వరలక్ష్మీ, రైతులు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



బూర్జ : విత్తన తయారీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు తీవ్ర విఘాతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర ఒత్తిడికి గురి అవుతోందని, దశాబ్దాల నుంచి అమలులో ఉన్న ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు తీవ్ర విఘాతం ఏర్పడుతోందని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని తహశీల్దారు కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ధర్నా శిబిరం వద్ద భానుమూర్తి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల స్థానంలో కేవలం ఒకటి, రెండు తరగతులతో వేల సంఖ్యలో ఫౌండేషన్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని, పాఠశాల వ్యవస్థను ముక్కలు చేస్తూ ఎనిమిది రకాలుగా విభజిస్తున్నారన్నారు. ఈ విధానం వలన ప్రాథమిక విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు. మరోవైపు ఉపాధ్యాయ, ఉద్యోగులకు 12వ పిఆర్‌సి అమలులో భాగంగా కమిషన్ నియామకం, మధ్యంతర భృతి, డిఎల చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దాసరి రామ్మోహనరావు, వి.నవీన్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్.శంకర్రావు తదితరులు మాట్లాడారు. ధర్నా అనంతరం తహశీల్దార్ ఎస్.గణపతి రావును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సిహెచ్ త్రినాథరావు, ఆర్‌విఎస్ ప్రసాద్, డి.మోహనరావు, వి.రామారావు, ఎం.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పేడాడ అప్పల నాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.సూర్యనారాయణ, ఆమదాలవలస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. సుందరరావు, బి.మహేష్, సరుబుజ్జిలి అధ్యక్షులు ఎస్.రామన్న, టి.విశ్వనాథం, సీనియర్ నాయకులు హెచ్.వి. సత్యనారాయణ, బి.వి.రమణ, పి. సూర్యనారాయణ, పి.అప్పారావు, ఎపిటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆమదాలవలస : నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పలాస : సిపిఎస్ విధానాన్ని రద్దు చైసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బల్ల సుభాష్‌బాబు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.రామన్ నాయుడు, టి.వి.ఎస్.నారాయణ, వజ్రపుకొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి కె.వెంకటరావు పాల్గొన్నారు.

సోంపేట : అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ నాయకులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో జి.భీమారావు, కె.పాపారావు, జి. తిరుపతి రావు, చక్రధర్, టి.ఈశ్వరరావు, కె.హరీష్ పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న తులసి

విద్యుదాఘాతంతో బాలికకు గాయాలు

కవిటి: మండలంలోని సిహెచ్.కపాసుకుద్దికు చెందిన మైలిపిల్లి తులసి సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడింది. వ్యతిగత పనిమీద బయటకు వెళ్తున్న తులసి పక్కనే ఉన్న ట్రాన్స్ ఫార్మర్ వద్ద నిలిచి ఉన్న నీటిలో అడుగు వేసింది. దీంతో ఒక్కసారిగా షాక్ తగలడంతో ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న స్టే వైర్ పట్టుకుంది. దానికీ విద్యుత్ సరఫరా అవుతుండడంతో తులసికి తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి కవిటి ప్రభుతాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108లో ఒడిశా రాష్ట్రం బరంపురం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ వైర్ సరిగా లేకపోవడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు ఆరోపిస్తు న్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా ఆదివారం రాత్రి పట్టుకుని మద్యం సీసాలను సీజ్ చేసి, ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణాపై వచ్చిన సమాచారం మేరకు సంచాం గ్రామ జంక్షన్ వద్దకు చేరుకునే సరికి ఇద్దరు వ్యక్తులు ఒక పల్సర్ మోటార్ సైకిల్‌పై మధ్యలో మూడు అట్ట పెట్టెలు పట్టుకొని వస్తుండగా పోలీసులను చూసి పారిపోవుటకు ప్రయత్నించగా వెంబడించి వారిని పట్టుకుని పరిశీలించగా అందులో మద్యం బాటిళ్లు ఉన్నాయన్నారు. మద్యం బాటిళ్లతో ఉన్న వ్యక్తులు మీసాల రాము, గంట్యాడ సాయికుమార్ వివిధ మద్యం షాపుల్లో మద్యం కొనుగోలు చేసి వారి గ్రామంలో తన స్నేహితుడైన బొంతు గణేష్‌తో కలిసి అమ్ముతూ అధిక ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. తన స్నేహితుడు బొంతు గణేష్ కూడా మద్యంతో పట్టుబడగా 193 మద్యం బాటళ్లను, పల్సర్ బైకును సీజ్‌చేసి ముగ్గురు వ్యక్తుల్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.


పట్టుబడిన మద్యం సీసాలు

ప్రయివేట్ విద్యాసంస్థల ఫ్లెక్సీలు తొలగించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస మున్సిపాలిటీలో విచ్చలవిడిగా విద్యా సంస్థల పబ్లిసిటీ కోసం అతికించిన ఫ్లెక్సీలు తొలగించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రవి కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే శ్రీచైతన్య, నారాయణ, భాష్యం, తదితర కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్నారని మండిపడ్డారు. అడ్మిషన్లతో పాటు మరోవైపు విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను వేల రూపాయలకు అమ్ముతూ తల్లితండ్రులను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉందన్నారు. అయినా పుస్తకాలు, యూనిఫారాలు, షూ, టై, బెల్ట్ రకరకాల


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వస్తువులు విద్యాసంస్థల్లో వేల రూపాయలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఒక విద్యాసంస్థలతో అనుమతి తీసుకొని రెండు మూడు నడుపుతున్నారని తెలిపారు, కార్యక్రమంలో కె.సాయి, చైతన్య, జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విరాళం


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని సుందరాడ, ముజ్జడపేట గ్రామాల్లో విగ్రహాలను ఆదివారం ప్రారంభించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సందర్శించారు. సుందరాడ పోలేరమ్మ విగ్రహానికి రూ.25 వేలు, ముజ్జడపేట అభయాంజనేయ విగ్రహానికి రూ.15 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, బమ్మిడి జగన్నాథం, రవి కుమార్, రామారావు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్రజాశక్తి- నరసన్నపేట

కడపలో 27,28,29 తేదీల్లో నిర్వహించనున్న టిడిపి మహాసభలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థాగత ఎన్నికలపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, భైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, జి.చిట్టిబాబు, బగ్గు గోవిందరావు, వెలమల రాజేంద్ర, ధర్మాన తేజ్‌కుమార్, కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతి పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నవితరణ


అన్నవితరణ చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నిరుపేదలు, ఎటువంటి ఆశ్రయం లేక నైట్‌షెల్టర్‌లో తలదాచుకుంటున్న పేదలకు సాయమందించాలన్న చిన్నారుల సంకల్పం స్ఫూర్తినిస్తోందని లయన్స్ క్లబ్ ప్రతినిధులు శివతేజ అన్నారు. సోమవారం జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వి.విజయ్ కుమార్‌తో కలిసి ఆయన కుమార్తెలు హర్షిత, వార్షితలు నగరంలోని గొంటివీధిలో నిరుపేదలకు అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నారులతో పాటు వారి తండ్రి విజయ్ కుమార్‌ను ఆయన అభినందించారు.

ప్రభుత్వ ఐటిఐ స్థలం కబ్జాకు యత్నం!


చదును చేస్తున్న ప్రొక్లెయినర్

పలాస: పలాసలోని డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాల స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నాలు చేస్తున్నారు. సోమవారం పునాదులు వేసేందుకు పలాసకు చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రయత్నాలు చేశారు. ప్రొక్లెయినర్‌తో చదును చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ప్రిన్సిపాల్ పైల జవహార్ సంఘటన స్థలానికి చేరుకొని అడ్డుకున్నారు. ఆ ఇద్దరు వ్యక్తులు ప్రిన్సిపాల్‌పై తిరగబడుతూ అయితే సంబంధించిన కాగితాలు తిరిగి చూపించమని ఒత్తిడి తెచ్చారు. వెంటనే ప్రిన్సిపాల్ కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ పి.కళ్యాణ్ చక్రవర్తి, కమిషనర్ నడిపేన రామారావు దృష్టికి తీసుకెళ్లారు.

డిఎస్‌సి అభ్యర్థులకు చేయూత


ఉచిత మెటీరియల్ పుస్తకాన్ని అందజేస్తున్న రాజేష్

ప్రజాశక్తి- ఆమదాలవలస

డిఎస్‌సి ఉపాధ్యాయ పరీక్షల్లో పాల్గొనే జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులకు వజ్రపు కొత్తూరు బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు అంపోలు రాజేష్ తనవంతు సహకారం అందిస్తున్నారు. మండలంలోని కొర్లకోటకు చెందిన రాజేష్ కొంతమంది డిఎస్‌సి అభ్యర్థులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా డిఎస్‌సి పరీక్షలకు అవసరమైన ప్రత్యేక మెటీరియల్ పుస్తకాన్ని ఆయన రూపొందించారు. ఈ పుస్తకాన్ని ఇటీవల ఎమ్మెల్యే కూన రవికుమార్ చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది. జిల్లాలోని డిఎస్‌సి అభ్యర్థులు పరీక్షలకు తమకు ఎటువంటి సలహాలు, సూచనలు కావాలన్నా తాను ఉచితంగా తర్ఫీదు ఇస్తానని తెలిపారు. అలాగే ప్రత్యేక మెటీరియల్ పుస్తకాన్ని ఉచితంగా అందించునున్నట్లు రాజేష్ తెలిపారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పాలవలస రైతు సేవా కేంద్రంలో సోమవారం జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ అధికారి ఎం.శ్రీనివాసరావు రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క రైతు తమ పొలం సామర్థ్యత పెంపొందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు వేసి అధిక దిగుబడి పొందేందుకు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతిఒక్కరు సేంద్రియ ఎరువుల వాడకానికి ముందుకు రావాలన్నారు. 10 కిలోల విత్తనం బ్యాగు రకాన్ని బట్టి రూ.560, రూ.630లకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సహాయకులు హేమలత, ప్రజాప్రతినిధులు జల్లు పొలినాయుడు,


రైతులకు పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి

నిలురోతు రామకృష్ణ, పైల నరసింహ నాయుడు, దుప్పాడ భాస్కరరావు, పనస తవిటినాయుడు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పూడిలంకకు తీరనున్న కష్టాలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడిలంకకు కష్టాలు తీరనున్నాయని టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, మాజీ ఎంపిపి గోరకల వసంతస్వామి అన్నారు. ఈ మేరకు పూడిలంక రహదారిని గ్రామస్తులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ మంత్రి గౌతు శివాజీ హయంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారని అన్నారు. వైసిపి ప్రభుత్వ హయంలో రహదారి నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష కృషితో ఉపాధి హామీ నిధులు రూ.3.88 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పూడి జగన్నాథపురం, మాజీ సర్పంచ్ తిమ్మల కృష్ణారావు, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో గందరగోళం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడలో చేపడుతున్న ఉపాధి పనుల్లో గందరగోళం నెలకుంది. సోమవారం నౌపడలో పాత పోలీసు స్టేషన్ వీధికి చెందిన 90 మంది కూలీలు, సాల్ట్ కాలనీకి చెందిన మరో 50 మంది కూలీలు రెండు చెరువులు వద్ద పనులకు డిమాండ్ వేశారు. అయితే వీరిలో పాత పోలీసు స్టేషన్ వీధికి చెందిన 50 మంది కూలీలు వర్కు ఐడీ నంబరు 9999005200552తో చర్చ్ దగ్గర చెరువు వద్ద క్షేత్ర సహాయకుడు దేవనందరెడ్డి పని కల్పించారు. మిగిలిన 40మంది కూలీలకు వర్కు ఐడీ 9999005200556 బొడ్లబాయ్ చెరువు వద్ద ఉపాధి పనికల్పించారు. అయితే సోమవారం ఉదయం అదే వీధికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందడంతో 90 మంది కూలీలు ఉదయం పనులకు హాజరుకాలేదు. రెండో పూట హాజరైన కూలీలు 90 మంది చర్చ్ దగ్గర చెరువు వద్దకే వెళ్లిపోయారు. క్షేత్రసహాయకుడు వెళ్లి 40మంది కూలీలకు బొడ్లబాయ్ చెరువు వద్దకు వెళ్లి పనిచేయమని సూచించారు. అయితే ఆ 40 మంది ఉపాధి కూలీలకు చెందిన ఓ మహిళ వీధి మొత్తం ఒకే చోట పని కల్పించాలని, ఎక్కడ పని ఇస్తే అక్కడకు వెళ్లడం కుదరదని,


ఉపాధి హామీ పనుల వద్ద ఉన్న కూలీలు

తనతో ఉన్న 40 మందికి ఇక్కడే పని కల్పించాలని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ పై చిందులు వేసింది. దీంతో ఉపాధి హమీ పని లోకేషన్ జియోట్యాగింగ్ బోడ్లబాయ్ చెరువుకు జరిగిందని, అక్కడకు వెళ్తేనే హాజరు నమోదు అవుతుందని ఫీల్డ్ అసిస్టెంట్ దేవనందరెడ్డి 40 మంది కూలీలకు చెప్పుకొచ్చారు. దీంతో ఆగ్రహించిన ఉపాధి కూలీలు సంబంధిత చెరువు వద్ద గందరగోళం సృష్టించారు. స్థానిక నాయకుల వద్దకు, మంత్రి అచ్చెన్నా యుడు వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని రుబాబు చేశారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ దేవానందరెడ్డి మాట్లాడుతూ తాను జియో టాకింగ్ చేసిన చెరువు వద్ద మాత్రమే కూలీలకు హాజరు నమోదు అవుతుందని సూచించానని, ఎవరు పైన కూడా కేకలు వేయలేదని బదులిచ్చారు.

నూతన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.గోపాలకృష్ణ, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వేణుగోపాల్‌లు 'ఎకనమిక్స్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్ ఫర్ ఇంజినీర్స్' అనే పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు సోమవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని బిటెక్ ఇంజినీరింగ్ కోర్సుల విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ డి.శ్రీరాములు, డాక్టర్ బి.శివకుమార్‌లు పాల్గొన్నారు.

వికలాంగుల అవస్థలు


వేచి ఉన్న వికలాంగులు

టెక్కలి రూరల్ : వజ్రపుకొత్తూరు మండలంలో పింఛను అందుకుంటున్న వికలాంగులు సదరం ధ్రువపత్రాల పరిశీలనకు సోమవారం ప్రకటించడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి సోమవారం వచ్చారు. వైద్యులు ఈరోజు కాదని మరలా మీకు అధికారులు సమాచారం అందిస్తారని చెప్పడంతో వికలాంగులు లబోదిబోమంటూ వెనక్కి తిరిగారు. అయితే అధికారులు తేదీ ప్రకటించినా... ఆస్పత్రి సిబ్బంది పరిశీలించకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. వికలాంగులు వచ్చి పోయేందుకు ఖర్చుల భారం కావడంతో మదన పడుతున్నారు.

వెంకటరమణ పరామర్శ


పరామర్శిస్తున్న వెంకటరమణ

కొత్తూరు : స్థానిక విశాలాంధ్ర విలేకంరి కలిశెట్టి రమణమూర్తి భార్య రమాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి పార్ల మెంటరీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం బిల్లుమడ సోమవారం చేరుకున్నారు. ఈ మేరకు రమణమూర్తిని పరామర్శించి రమాదేవి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో టిడిపి నాయకులు ఉన్నారు.

వాహనాల దారిమళ్లింపు

పాతపట్నం : మండలంలోని తుంబూరులో అమ్మవారి ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా మంగళ, బుధవారాల్లో ట్రాఫిక్ మళ్లిస్తున్నామని ఎస్ఐ బి.లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి నుంచి పాతపట్నం వెళ్లడానికి భారీ వాహనాలకు ప్రవేశం లేదన్నారు. ఆర్‌టిసి బస్సులకు మాత్రం టెక్కలి నుంచి తెంబూరు వరకు, పాతపట్నం నుంచి తెంబూరు రైల్వే స్టేషన్ వరకు దారి మళ్లించామని తెలిపారు. ఈ రెండు రోజులు అమ్మవారి పండగలు వాహనాల రాకపోకల రద్దీ కారణంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా మళ్లించామని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.